
ఆంధ్రజ్యోతి

రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.33 | సహర్ : 4.56 (శనివారం)

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

శుక్రవారం 22 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 | కనిష్ఠం 23.0

యాదగిరిక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

పరిసమాప్తం

- శాస్త్రోక్తంగా అష్టోత్తర శతఘటాభిషేక పూజలు
- రాత్రికి శృంగార డోలోత్సవం
- నేటి నుంచి నిత్య కల్యాణం, సుదర్శన హోమ పూజలు ఆరంభం



స్వామివారికి శృంగార డోలోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



స్వయంభూ పంచనారసింహుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజైన గురువారం ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రికి శృంగార డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో సిద్ధంగా ఉంచిన 108 వెండి కలశాలలో గంగాది సప్తనదీ జలాలను, పంచామృతాలు, ఔషధాలతో నింపిన అర్చకస్వాములు దర్భ, మామిడి ఆకులను, కొబ్బరికాయలు, వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి విశ్వక్సేనుడిని ఆరాధిస్తూ హోమం, పూర్ణాహుతి పర్వాలు జరిపి అష్టోత్తర శతఘటాభిషేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

•7లో..



టికెట్లపై ఉత్కంఠ

- అభ్యర్థుల ఖరారులో జాప్యం చేస్తున్న బీఆర్ఎస్
- భువనగిరి సీటుపై కాంగ్రెస్‌లో పోటాపోటీ
- హోలీ వరకు వేచి ఉండాల్సిందేనంటున్న అధిష్ఠానాలు
- ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశావహులు

ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లకు బీఆర్ఎస్, భువనగిరి స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపికచేయడంలో జరుగుతున్న జాప్యం ఉత్కంఠను రేపుతోంది. భువనగిరి సీటుకు కాంగ్రెస్‌లో తీవ్రపోటీ నెలకొనడంతో ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తుండడంతో అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు దీటైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు బీఆర్ఎస్ యత్నిస్తోంది. భువనగిరి స్థానంలో బీజేపీ నుంచి మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్‌కు టికెట్ కేటాయించడంతో ఆయన ప్రచారం కొనసాగిస్తుంటే, ఆ స్థానంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లోనూ బీసీలకు టికెట్లివ్వాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ టికెట్ల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో పోటాపోటీ నెలకొనడం, అధిష్ఠానాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుండడంతో అభ్యర్థుల ఎంపిక మరింత జాప్యం కానున్నట్టు తెలుస్తోంది. హోలీకి ఒకరోజు ముందు, లేదా పండుగ తర్వాత అభ్యర్థుల ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

నల్లగొండ, భువనగిరి స్థానాల్లో బీఆర్ఎస్ ఎవరిని బరిలో దింపుతుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. తొలుత ఈ స్థానాల్లో అధిష్ఠానం అవకాశం కల్పిస్తే పోటీచేస్తారని భావించిన గుత్తా అమిత్‌రెడ్డి, చివరికి పోటీ నుంచి విరమించుకున్నారు. హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరి అభ్యర్థిగా బరిలోకి వచ్చారు. మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి సైతం బీజేపీ వైపే చూస్తున్నారనే సమాచారంతో నల్లగొండ నుంచి ఎవరిని బరిలో దింపాలనే అంశంపై పార్టీ ముఖ్యనేతలతో అధినేత కేసీఆర్ చర్చిస్తున్నట్లు తెలిసింది. ఈ స్థానంలో అవకాశమిస్తే పోటీకి సిద్ధమని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి పార్టీ అధినేతకు, ఇతర ముఖ్యనేతలకు చెప్పడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం. పార్టీ కీలక నేతలు, మాజీ ఎమ్మెల్యేల మద్దతు తమకే ఉందని, టికెట్ ఇస్తే గెలిచి తీరుతామని కంచర్ల బ్రదర్స్ అధిష్ఠానం వద్ద పట్టుబడుతున్నారు.

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి సైతం తనకు ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించాలని పార్టీ అధినేత కేసీఆర్‌కు విన్నవించారు. 2001లో పార్టీ ఆవిర్భావం నుంచి తాను పార్టీలో ఉన్నానని, ఉద్యమకారుల కోటాలో తనకు మాజీ సీఎం కేసీఆర్ అవకాశం కల్పిస్తారని ఆయన ధీమాతో ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తరువాత పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో తనకు ఎలాంటి అవకాశాలు రాలేదని, వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఈ దఫా తనకు ఎంపీగా పోటీఛాన్స్ దక్కుతుందని చెబుతున్నారు. వీరితో పాటు సామాజికసమీకరణాలను దృష్టిలో ఉంచుకొని బీసీ, ఎస్టీ వర్గాల నేతలను బరిలో దింపే అంశంపైనా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు.



- భువనగిరి స్థానంలోనూ బీఆర్ఎస్ అభ్యర్థిత్వంపై ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానంలో బీజేపీ నుంచి ఇప్పటికే బీఆర్ఎస్ పూర్వ ఎంపీ, బీసీ నేత డాక్టర్ బూరనర్సయ్యగౌడ్‌కు కేటాయించడంతో బీఆర్ఎస్ నుంచి కూడా మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌ను బరిలో దింపుతారనే చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. అయితే ఈ స్థానంలో తనకు అవకాశం దక్కుతుందనే ధీమాతో తెలంగాణ ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి అధిష్ఠానం వద్ద పావులు కదుపుతున్నారు. మరో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి పోటీచేస్తారని చర్చ సాగుతుంటే, కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ఆయన చేరికను వ్యతిరేకిస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.
- భువనగిరి నుంచి తన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మికి పోటీ అవకాశం కల్పించాలని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పట్టుబడుతుంటే, సీఎం ముఖ్య అనుచరుడు, పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి టికెట్ వస్తుందనే ధీమాలో ఉన్నారు. పార్టీ అవకాశం ఇస్తే పోటీకి సిద్ధమని గుత్తా అమిత్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, పున్నా కైలాష్‌నేత, చనగాని యాదగిరిగౌడ్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రెండు స్థానాల్లో బీఆర్ఎస్, భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి తేలితే గానీ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది.

రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దే

ఎండిన పంటలను పరిశీలించిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



దుబ్బతండాలో ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న జగదీష్‌రెడ్డి

సూర్యాపేటరూరల్, మార్చి 21: రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని యర్కారం, దుబ్బతండా, రేఖ్యానాయక్ తండాల్లో ఎండిన వరి పొలాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఎస్సారెస్పీ ఫేజ్-2 ద్వారా నీళ్లు ఇస్తామంటేనే రైతులు కాల్వల కింద పంటలను సాగుచేశారన్నారు. హామీ మేరకు పంటలకు నీరు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేటా ముంచిందన్నారు. ప్రభుత్వాన్ని నమ్మి ఒక్కో రైతు రూ.25 వేల నుంచి రూ.30వేలు అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టారన్నారు. ప్రభుత్వ అవగాహనారాహిత్యం కారణంగా రైతులు నడి రోడ్డున పడ్డారని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో మొన్నటి వరకు జాలు వారిన పొలాలు నేడు మోడువారడానికి నూరుశాతం ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. పోరాడి సాధించిన తెలంగాణను కేసీఆర్ సస్యశ్యామలం చేస్తే మూడె నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేసిందన్నారు. కాళేశ్వరం నీళ్ల ఎత్తిపోయడానికి మూడు పీయర్ల కుంగుబాటుకు సంబంధం లేకున్నా, గత ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకే రైతాంగానికి నీళ్లు ఇవ్వడం లేదన్నారు. రైతు బంధు రాలేదని ప్రశ్నించిన రైతును చెప్పుతో కొడతాననడం దుర్మార్గమన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో రైతు తప్పిదంతో ఒక్క మడి ఎండితే నానా హంగామా చేసిన భట్టి విక్రమార్క ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

రాష్ట్ర వ్యాప్తంగా పంట పొలాలు నీరు లేక ఎండిపోతుంటే మంత్రులు కనీసం సమీక్ష చేయకపోవడం రైతులపై ఈ ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఏపాటిదో అర్థమవుతోందన్నారు. పంట నష్టంపై మంత్రివర్గ సమావేశం నిర్వహించి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జీడీ భిక్షం, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ నాయుడు, ఎంపీటీసీ శాంతాబాయి, అనంతరెడ్డి, మధు, ఉయ్యాల రవి, నవీన్, మల్లేషం, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



శ్రీచైతన్య పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట అర్బన్, మార్చి 21: పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని ఆదేశించారు. ప్రతీ విద్యార్థిని తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రానికి అనుమతించాలని సూచించారు.

ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో పదో తరగతి పరీక్షను మూడో అంతస్తులో ఏర్పాటు చేయడంపట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థులు పరీక్షలు రాయడానికి మూడు అంతస్తులకు చేరుకోవడానికి అలసట చెందుతున్నారన్నారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏడీ శైలజను ఆదేశించారు.ఆయన వెంటచీఫ్ సూపరింటెండెంట్ తబిత,అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వెబ్‌ఎక్స్ ద్వారా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో నీటి ఎద్దడి గురించి తగిన చర్యలపై ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలన్నారు. తాగునీటి పైపులను కావాలని ఎవరైనా ధ్వంసం చేస్తే కేసులు నమోదు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని, చేతిపంపులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. సూర్యాపేట నియోజకవర్గం లో ఆత్మకూర్(ఎస్), చివ్వెంల,కోదాడ నియోజకవర్గంలో మోతె,తుంగతుర్తి నియోజకవర్గంలో జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నాగారం, నూతనకల్‌లోని పలు గ్రామాల్లో శనివారంవరకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

మునగాల రూరల్: వేసవిలో నీటిఎద్దడి లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని నీటి ట్యాంకు, గణపవరం రోడ్డు వెంట ఉన్న నీటి ట్యాంకును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలో నీటి ఎద్దడి ప్రాంతాలను తక్షణమే గుర్తించి, బోరుబావులకు మరమ్మతు చేయించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీవో భూపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

'పది' పరీక్షలకు 11,894 మంది హాజరు

భానుపురి: జిల్లాలో బుధవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు 11,894 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 67 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తుండగా, మొత్తం 11,937 మంది విద్యార్థులకు 43 మంది మాత్రమే గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు తొమ్మిది మందికి ఆరుగురు హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. సూర్యాపేట మండలంలోని ఓ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ వెంకట్రావ్, నాలుగు పరీక్షా కేంద్రాలను జిల్లా స్థాయి పరిశీలకుడు సీహెచ్.రమణకుమార్, మూడు పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్‌స్క్వాడ్స్ తనిఖీ చేశాయని, ఎక్కడా మాస్‌కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని డీఈవో అశోక్ తెలిపారు.

ఐటీఐ కళాశాలకు రూ.41.28 కోట్లు మంజూరు



హుజూర్‌నగర్,మార్చి 21: హుజూర్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.41.28కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్ర కటన విడుదల చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అభివృద్ధి పనులకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరుచేసిందన్నారు. హుజూర్‌నగర్‌లో ఏటా 110మంది విద్యార్థులకు ఉపాధి కోర్సులు అందించేందుకు ప్రభుత్వం ఐటీఐ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు.

ఐటీఐలో పాత కోర్సులతో పాటు అదనంగా ఐదు రకాల కొత్త ట్రేడ్‌లను ఏర్పాటుచేస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు. రెండేళ్ల వ్యవధి ఉండే ఫిట్టర్‌లో రెండు యూనిట్లలో 40మంది విద్యార్థులకు విద్యనభ్యసించే అవకాశం ఉందన్నారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్ రెండు యూనిట్లలో 40మంది విద్యార్థులకు రెండేళ్ల విద్య, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్‌లో రెండు యూనిట్లలో 40మంది విద్యార్థులకు, డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో రెండు యూనిట్లలో 40మంది విద్యార్థులకు, వెల్డర్ ట్రేడ్‌లో రెండు యూనిట్లలో 30మంది విద్యార్థులకు ఒకే ఏడాది కోర్సు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఐటీఐలో ప్రభుత్వం సివిల్ పనులు, యంత్రాంగం, పరికరాలు, ట్రైనర్లు, మానవ వనరుల ఏర్పాటుకు అత్యవసర వ్యయం కింద రూ.41.28కోట్లు మంజూరుచేసిందన్నారు. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంతో ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ, రోబోటిక్స్, ఆటోమేషన్, సీఏడీ, సీఏఎం, సీఎన్‌సీ మెషినింగ్, అడ్వాన్స్ ప్లంబింగ్, ఆడిటివ్ మ్యాన్‌ఫ్యాక్చర్ వంటి 23 స్వల్పకాలిక కోర్సులతో పాటు న్యూఢిల్లీలోని జాతీయ వృత్తి శిక్షణ మండలి ఆమోదించిన ఆరు దీర్ఘకాలిక ట్రేడ్స్‌లో 40 అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టిందని తెలిపారు. హుజూర్‌నగర్‌లో కొత్త కోర్సులతో పాటు పాత కోర్సులు మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ ఏడాది కోర్సు, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఏడాది కోర్సు, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్ (మెకానికల్)కోర్సు, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికల్ కోర్సులు ఉంటాయన్నారు. ఈ కోర్సుల కోసం 17 మంది రెగ్యులర్ ఉద్యోగులు, ఐదుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. హుజూర్‌నగర్‌లో ఐటీఐ ఏర్పాటుతో ఎంతో మంది విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులో ఉండడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సరిహద్దులో నిఘా పెంచాలి

ఎస్పీ రాహుల్‌హెగ్డే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేటక్రైం, మార్చి 21: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులో నిఘా పెంచాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి కోదాడ సబ్‌డివిజన్ స్థాయి పోలీస్ అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా దర్యాప్తు చేసి చార్జిషీట్ త్వరగా కోర్టుకు పంపాలని సూచించారు. దొంగతనాల కేసులు త్వరితగతిన విచారించాలన్నారు. గంజాయి కేసుల నమోదు, సైబర్ నేరాల నమోదు, రికవరీల్లో ప్రణాళిక ప్రకారం ముందుకువెళ్లాలన్నారు. సైబర్ మోసాలు జరగకుండా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. జిల్లా సరిహద్దుల నుంచి అక్రమ రవాణా జరగకుండా నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇతరశాఖల సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని, బ్లూకోల్ట్స్ సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పాండరి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, సీఐలు చలమంద రాజు, రంజిత్‌రెడ్డి, రాము, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు

జరగకుండా చర్యలు

అర్వపల్లి, మార్చి 21: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని సూర్యాపేట డీఎస్పీ రవి అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు తిమ్మాపురం గ్రామంలో పారామిలటరీ దళాలతో నిర్వహించిన కవాతులో ఆయన పాల్గొని మాట్లాడారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా మద్యం,డబ్బు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ రోజు వాహనాలను తనిఖీ చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ రఘువీరారెడ్డి, ఎస్ఐయాకుబ్, ఏఎస్ఐ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్వపల్లిలో కవాతులో పాల్గొన్న సూర్యాపేట డీఎస్పీ రవి

పుస్తెలతాడు చోరీ చేసిన నిందితుడిఅరెస్ట్

భువనగిరి రూరల్, మార్చి 21: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలో మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనరేట్ భువనగిరి జోన్ డీసీపీ రాజేష్‌చంద్ర తెలిపారు. గురువారం ఏసీపీ రవికిరణ్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 15న మండలంలోని బస్వాపురానికి చెందిన దంపతులు పులి రాంచందర్, చంద్రకళ భువనగిరి పట్టణంలోని రైతు బజారు నుంచి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా భువనగిరి మండలంలోని నమాత్‌పల్లికి చెందిన ఎల్లెంల మధు మార్గంమధ్యలో బస్వాపూర్ శివారులో ఈ నెల 15న రాత్రి వేళలో వారిని అడ్డగించి ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న చంద్రకళ మెడలోంచి నాలుగు తులాల బంగారు పూస్తెలతాడును అపహరించుకుపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన రూరల్ సీఐ ఎం.ప్రభాకరరెడ్డి, ఎస్ఐలు వి.సంతోష్‌కుమార్, నాగశివప్రసాద్ గురువారం భువనగిరి శివారులోని రాయిగిరి వద్ద మధును ప్రశ్నించగా తాను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, ట్రాక్టర్ ఫైనాన్స్‌కు సంబంధించి బాకీ చెల్లించేందుకు ఆమె మెడలోంచి బంగారు పుస్తెలతాడు దొంగిలించానని నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు, బైకు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఆయన తెలిపారు.

యాదగిరీశుడి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

● స్వయంభువులకు శాస్త్రోక్తంగా అష్టోత్తర శతఘటాభిషేకం ● రాత్రివేళ శృంగార దోలోత్సవం

స్వయంభు పంచనారసింహుడు.. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రివేళ స్వామి, అమ్మవార్లను కొలుస్తూ లాలిపాటలతో నిర్వహించిన శృంగార డోలారోహణంతో వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

● యాదగిరిగుట్ట

బ్రహ్మోత్సవాల్లో ఆసాంతం భక్తజనులను కటాక్షించేందుకు దశావతారాలు, వివిధ వాహనసేవల్లో అనుగ్రహించిన లక్ష్మీనరసింహుడిని 108 కలశాలతో వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించారు. ప్రధానాలయ ముఖమండపంలో 108 వెండి కలశాలను ఏర్పాటుచేసిన అర్చకులు కలశాలలో గంగాధి సప్తనదీ జలాలను, పంచామృతాలు, ఔషధాలతో నింపి దర్భ, మామిడి ఆకులను, కొబ్బరికాయలు, వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. ముందుగా విశ్వక్సేన పూజలతో పుణ్యాహవాచనం, హవన పూజలు చేసి పూర్ణాహుతిని సంప్రదాయరీతిలో జరిపారు. అనంతరం వేదపండితులు, రుత్వికులు పంచ సూక్తాలు, దశశాంతులు, నారాయణసూక్తం, పంచోపనిషత్తు పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ గర్భాలయంలోని స్వయంభువులకు, సువర్ణ ప్రతిష్టా అలంకారమూర్తులకు అష్టోత్తరశత కలశాలతో అభిషేక పూజలు నిర్వహించారు. అభిషేకమూర్తులు స్వామి, అమ్మవార్లను తులసీదళాలు, వివిధ రకాల పుష్పాలతో అర్చించి క్షేత్ర మహత్యాన్ని భక్తులకు వివరించారు. ఈ వైశేషిక బ్రహ్మోత్సవాలను శ్రీవైష్ణవ పాంచరాత్రగమ శాస్త్రరీతిలో దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యులు, అర్చక బృందం, రుత్విక బృందం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

శృంగార దోల్సోతవం

బ్రహ్మోత్సవాల్లో 11 రోజులపాటు నిర్విఘ్నంగా కొనసాగిన పూజాకైంకర్యాల్లో ఓలలాడిన కల్యాణమూర్తులు లక్ష్మీనృసింహులను పట్టుపీతాంబరాలు, ముత్యాలరత్నాల ఆభరణాలు, వివిధ రకాల పూలతో దివ్య మనోహరంగా అలంకరించి డోలిక (ఊయల)లో అధిష్ఠింపజేశారు. డోలారూఢుడైన స్వామిని సకల జగత్తును రక్షింపమని కోరుతూ సర్వవిధ రాగ తాళములతో, సహస్రనామాలతో కొలుస్తూ శృంగార డోలారోహణపర్వాన్ని జరిపారు. ఆది దంపతులు లక్ష్మీనృసింహులను డోలారోహణపర్వంలో గాంచిన సకల పాపాలు తొలగుతాయని, సర్వత్రా శుభాలు వెల్లివిరుస్తాయని, నిత్యకల్యాణ మూర్తి శృంగార చేష్టలు అపూర్వమైనవని నృసింహ పురాణం తెలుపుతుందని పూజారులు వివరించారు. శృంగార డోలోత్సవ కార్యక్రమంలో డి.సులక్షణాదేవి బృందం భక్తిరసమైన కీర్తనలు ఆలపించారు. అర్చకబృందం స్వామి, అమ్మవార్లకు అత్తరు, పన్నీరు, సుగంధ ద్రవ్యాలను సమర్పించి కొలిచారు.



దోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నేటినుంచి నిత్య మొక్కుకల్యాణాలు ఆరంభం

యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి సన్నిధిలో బ్రహ్మోత్సవాల సందర్భంగా 11రోజులుగా స్వామి వారి నిత్యకల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన నారసింహ హవన పూజలను నిలిపివేశారు. గురువారం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి శృంగార డోలోత్సవ వైదికపర్వాలతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. దీంతో శుక్రవారం నుంచి తిరిగి భక్తులు నిర్వహించుకునే శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన హోమ పూజలు ఆరంభం కానున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.



స్వామికి సంప్రదాయ పూజలు

యాదగిరీశుడికి గురువారం నిత్యపూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకులు గర్భాలయంలోని స్వయంభువులకు, సువర్ణ ప్రతిష్టా అలంకార కవచమూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ముఖమండపంలో సువర్ణ పుష్పార్చనలు, అష్టోత్తర పూజలు కొనసాగాయి. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి, స్పటిక మూర్తులకు నిత్య పూజలు, యాగశాలలో రుద్రహవనం స్మార్త సంప్రదాయరీతిలో నిర్వహించారు.

నేడు కొండేటి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

నల్లగొండ రూరల్, మార్చి 21: రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని తుక్కుగూడ వివేకానంద నగర్ కాలనీలో జాగృతి ఉమెన్స్ మహిళా కళాశాల ఎదురుగా కొండేటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం ప్రారంభించనున్నట్లు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ కొండేటి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక హంగులతో ఆస్పత్రిని నిర్మించినట్లు తెలిపారు. ఆస్పత్రిని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారని, అదేవిధంగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తోపాటు, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మిర్యాలగూడలో 30 నుంచి జాతీయస్థాయి నాటకోత్సవాలు

మిర్యాలగూడ టౌన్, మార్చి 21: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జాతీయస్థాయి నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు సాంస్కృతిక కళాకేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి భుజంగరావు, పులి కృష్ణమూర్తి తెలిపారు. పట్టణంలోని కళాభారతి మినీ రవీంద్రభారతిలో నందినీ నాటకోత్సవాలు ఈ నెల 30న ప్రారంభమై ఏప్రిల్ 4వ తేదీ వరకూ కొనసాగుతాయన్నారు. జాతీయస్థాయిలో నిర్వహించే ఈ పోటీలు పద్య, సాంఘిక విభాగాల్లో కొనసాగుతాయని, ఈ పోటీలకు గతేడాది సెప్టెంబరులో నోటిఫికేషన్ ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి ఎంట్రీలు రాగా 9 పద్య, 12 సాంఘీక నాటికలను తుది పోటీకి ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో దుర్గి శ్రీనివాసశర్మ, పుల్లాబట్ల లక్ష్మీనారాయణశర్మ, చంద్రశేఖరరావు, ఉపేందర్, రామావతారం, బాబూరావు పాల్గొన్నారు.

పరిశోధనలతో రైతులకు సత్ఫలితాలు

● సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి ● ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ సుధారాణి ● నల్లగొండలో రెండు రోజులపాటు దక్షిణ తెలంగాణ వ్యవసాయాధికారుల సమావేశాలు

నల్లగొండ, మార్చి 21: విశ్వవిద్యాలయాల్లో చేస్తున్న పరిశోధనలు రైతులకు చేరువై సత్ఫలితాలు వస్తున్నాయని, 25శాతంపైగా రైతులకు విస్తరణ సేవలు లభిస్తున్నాయని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, వ్యవసాయ విస్తరణ డైరెక్టర్ వి.సుధారాణి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ అధికారుల సలహాసంఘ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనల్లో నిరూపించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పరిశోధన ఫలాలు రైతులకు మరింత చేరువైతే రాబోయే కాలంలో వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు రూపొందించవచ్చన్నారు. ఇందుకోసం శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు రైతులతో మమేకం కావాలని కోరారు. వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా అధికారులు, శాస్త్రవేత్తలు రైతులను చైతన్యవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పప్పుదినుసులు, నూనె గింజల పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రణాళికలను రూపొందిస్తుందని తెలిపారు. వ్యవసాయశాఖ రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసిందని, దీని వల్ల రైతులకు వ్యవసాయంపై అవగాహన కలుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పథకాలు, సమాచారం త్వరితగతిన ఈ విధానం ద్వారా చేరుతుందన్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు కావల్సిన అవసరాలను గుర్తించాలని, ఆయిల్ సీడ్స్ సీడ్ హబ్ ఉంటే రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. రాష్ట్రంలో 25శాతానికి పైగా రైతులు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విస్తరణ సేవలు పొందుతున్నారన్నారు.



నల్లగొండ కలెక్టరేట్‌లో వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా సంఘం సమావేశాలను ప్రారంభిస్తున్న సుధారాణి

రైతులు వైవిధ్యంగా ముందుకు సాగాలి

రైతులు పంటల సాగులో వైవిధ్యంగా ముందుకు సాగాలని వ్యవసాయ పరిశోధన డైరెక్టర్ వి.రఘురాంరెడ్డి సూచించారు. యాంత్రీకరణతో పంటల సాగుపై దృష్టిసారించాలని సూచించారు. వ్యవసాయంలో కూలీల కొరతను అధిగమించాలని, రాష్ట్రానికి అవసరమైన పంటల కొరతను తీర్చే దిశగా పంటల సాగును చేపట్టాలన్నారు. రాబోయే వ్యవసాయ సీజన్‌లలో చేపట్టాల్సిన పనులపై శాస్త్రవేత్తలు, అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వ్యవసాయ సహ పరిశోధన డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది చేసిన పరిశోధనలు ఫలితాలనిస్తున్నాయన్నారు. అదేవిధంగా పరిశోధనల్లో సమస్యలను, పరిష్కారం గురించి వివరించారు. ఈ రెండు రోజుల సమావేశాలకు దక్షిణ తెలంగాణలోని జోగులాంబగద్వాల, వనపర్తి, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి, నల్లగొండ, వికారాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాలకు చెందిన అధికారులు, శాస్త్రవేత్తలు హాజరై వ్యవసాయ స్థితిగతులు, ఎదుర్కొంటున్న సమస్యలు చేపట్టాల్సిన కార్యక్రమాలు వంటి అంశాలపై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహ పరిశోధన డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి, అధికారులు డాక్టర్ భరత్ భూషణ్, అనిల్‌కుమార్, లక్ష్మణ్, పి. శ్రవణ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, సుల్తాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో 26 ద్విచక్ర వాహనాలు చోరీ

● మెట్రో స్టేషన్ల వద్ద నిలిపిన వాహనాలే లక్ష్యం ● నెంబర్ ప్లేట్లు తొలగించి స్వగ్రామంలో తక్కువ ధరకు విక్రయం

బీబీనగర్, మార్చి 21: జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడు ద్విచక్ర వాహనాలు చోరీచేసి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో నిర్వహించిన వాహన తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. గురువారం రాచకొండ కమిషనరేట్ డీసీపీ రాజేశ్ చంద్ర బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన కూతాడి భానుచందర్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్‌లోని బాలాజీనగర్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తనకు వచ్చే సంపాదన జల్సాలకు సరిపోకపోవడంతో ద్విచక్ర వాహనాల దొంగతనాన్ని ఎంచుకున్నాడు. హైదరాబాద్‌లోని నాగోలు, ఉప్పల్, తదితర మెట్రో స్టేషన్ల వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను అపహరించి స్వగ్రామం కొండమడుగుతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో విక్రయించేవాడు. నగదు అవసరం ఉండటంతో అత్యవసరంగా అమ్ముతున్నానని నమ్మబలికి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుని జల్సాలు చేసేవాడు. ఇలా హైదరాబాద్ శివారు ప్రాంతాలు మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 4, ఉప్పల్ పరిధిలో 7, ఓయూ పరిధిలో 3, బీబీనగర్ పరిధిలో 1.. ఇలా మొత్తం 26 ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. ఈ నెల 20 అర్ధరాత్రి బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతూ టీఎస్ 30బీ 9841 నెంబర్ గల హోండా యూనిక్ బైకుతోపాటు పోలీసులకు పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలను అంగీకరించాడు. అతని నుంచి రూ.12లక్షల విలువైన 26 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పీడీయాక్టు కేసు నమోదు చేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరినట్లు తెలిపారు. దొంగిలించిన వాహనాల నెంబర్ ప్లేట్లు తొలగించడంతో వాహనదారుల గుర్తింపు కష్టంగా మారిందని, బాధితులు ఫిర్యాదు కాపీతోపాటు ఆర్‌సీ పుస్తకంతో వస్తే కోర్టు ద్వారా వాహనాలను అప్పగించనున్నట్లు తెలిపారు. నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను కొనుగోలు చేయవద్దని, ఒక వేళ కొనుగోలు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏసీపీ రవికిరణ్ రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ రమేశ్ పాల్గొన్నారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

స్ఫూర్తిని రగిల్చే శక్తి పాటకే సాధ్యం

సూర్యాపేటటౌన్, మార్చి 21: ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని రగిల్చే శక్తి పాటకు ఉందని జాతీయ ఉత్తమ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలో మనమ్‌వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సుద్దాల అశోక్‌తేజతో సాయంత్రం అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ గాయకుడైన సుద్దాల హనుమంతు వారసుడిగా ఆయన డీఎన్‌ఏ తనలో ఉందని, ఆ ప్రేరణ పాటలు రాసేలా చేస్తుందన్నారు. పనితోనే పాట పుట్టిందని, పాటతోనే పని జతకట్టిందన్నారు. శ్రమైక జీవన విధానంలో పాట కలిసి ఉందన్నారు. పుట్టిన మొదలు మనిషి చనిపోయే వరకు పాటతో ముడిపడిఉందన్నారు. ప్రస్తుత సమాజంలో కవులకు సరైన గుర్తింపు రావడంలేదన్నారు. తాను రాసిన 3వేల పాటలకు తన చుట్టూ ఉన్న మనుషులు, వస్తువులే స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. గతంలో 1952 సూర్యాపేటలో జరిగిన మునిసిపల్ ఎన్నికల సమయంలో తన తండ్రి పాల్గొన్న సభ కోసం సినిమా థియేటర్‌లో సాయంత్రం 6గంటల చిత్రప్రదర్శనను సైతం ఆపిన చరిత్ర సుద్దాల హనుమంతుదని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి కొంత శక్తి వస్తే పరిసరాల నుంచి, జానపద పాటల నుంచి మరికొంత శక్తి వచ్చిందన్నారు. అశోకవనం, శూద్ర గంగావధానం అనే రెండు కావ్యాలను త్వరలో రచించి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కొంత మంది తనను ఎర్ర కవిగా పరిగణించారని, తాను కుర్రకవిని కూడా అని గుర్తు చేశారు. ప్రముఖ కవి, జర్నలిస్టు ప్రసేన్ మాట్లాడుతూ సుద్దాల అశోక్‌తేజ రాసిన అనేక పాటలు దేశభక్తిని, ప్రేరణను నింపాయన్నారు. అంతకుముందు నిర్వహించిన గానకచేరీ శ్రోతలను అలరించింది. అనంతరం కవులను, గాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మనమ్‌వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్, సుధాబ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, పెద్దిరెడ్డి రాజా, కక్కిరేణి చంద్రశేఖర్, బోనగిరి భాస్కర్, గండూరి శంకర్, రమేష్, రచయితలు, కవులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

● కుమార్తె పెళ్లి కార్డులు పంచేందుకు వెళుతూ తండ్రి.. ఆస్పత్రికి వెళుతూ యువకుడి దుర్మరణం ● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. తిప్పర్తి మండలం దుప్పలపల్లి శివారులో జరిగిన ప్రమాదంలో ఒకరు, మర్రిగూడ మండలం సరంపేట గ్రామంలో మరొకరు, చౌటుప్పల్ మండలం గుండ్లబాయిలో ఇంకొకరు, హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని.. కనగల్ మండలంలో చికిత్స పొందుతూ మరొకరు మృత్యువాతపడ్డారు.



శ్రీకాంత్, సింగం గిరి (ఫైల్‌ఫొటోలు)

తిప్పర్తి, మార్చి 21: ఆస్పత్రికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం తిప్పర్తి మండల పరిధిలోని దుప్పలపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తిప్పర్తికి చెందిన చెర్కుపల్లి శ్రీకాంత్ (28) తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో నాలుగేళ్లుగా తాత్కాలిక డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా గురువారం అతనికి అనారోగ్య సమస్యతో చికిత్స నిమిత్తం ద్విచక్రవాహనంపై తిప్పర్తి నుంచి నల్లగొండకు వెళ్తున్నాడు. అనిశెట్టి దుప్పలపల్లి సమీపంలో ఉన్న కేఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్ క్రాస్ చేయగానే వెనకాలే మిర్యాలగూడ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న నాగాలాండ్‌కు చెందిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మృతుడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకొని డ్రైవర్ రిజ్వాన్‌పై కేసు నమోదు చేశారు. శ్రీకాంత్‌కు భార్య సుమలత ఉన్నారు. శ్రీకాంత్ తల్లి చెర్కుపల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

కనగల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రామక్రిష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలం దోనిపాముల గ్రామానికి చెందిన ఆలేటి అశోక్(21) హాలియాలోని అత్తగారింటి నుంచి బుధవారంరాత్రి బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. కాగా మార్గంమధ్యలో మండలంలోని జీఎడవల్లి గ్రామ శివారులో అతివేగం కారణంగా బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు 108 వాహనంలో నల్లగొండ ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. అయితే చికిత్స పొందుతూ గురువారం అశోక్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మర్రిగూడ: తన కుమార్తె పెళ్లి పత్రికలు పంపిణీ చేయడానికి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మర్రిగూడ మండలం సరంపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సింగం గిరి(50) తన కుమార్తె వివాహానికి సంబంధించిన పెండ్లి పత్రికలను గురువారం వనస్తలిపురం నుంచి సదాశివాపేటలో ఉంటున్న తమ బంధువులకు పెళ్లి కార్డులు పంపిణీ చేయడానికి కారులో బయలుదేరాడు. రంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం ఓఆర్ఆర్ రింగ్‌రోడ్డుపై ముందు వెళుతున్న లారీని వెనక నుంచి ఢీకొట్టగా కారులో ఉన్న గిరితో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో పటాన్‌చెరువు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన కుమార్తె పెళ్లి వచ్చేనెల 5వ తేదీన ఉన్నందున బంధువులకు పెళ్లిపత్రికలు ఇచ్చేందుకు వెళ్లి అనంత లోకాలకు వెళ్లడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గిరికి భార్య, కుమారులు ఇద్దరు, ఓ కుమార్తె ఉన్నారు.

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం గుండ్లబాయి జాతీయ రహదారిపై గురవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. సీఐ ఆశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి సాయికుమార్ (21), శివరాత్రి నవీన్‌లు స్నేహితులు. బైక్‌పై ఆందోళ్‌మైసమ్మ దేవాలయానికి వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా ముందు ఉన్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టారు. ఘటనలో సాయికుమార్ మృతి చెందగా నవీన్ గాయపడ్డాడు.

కొత్తపేట: ఎల్బీనగర్ రింగ్‌రోడ్డు వద్ద టీఎస్‌ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల మేరకు.. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో ఉండే వ్యవసాయదారుడు పాలపాటి రాధయ్య(80) గురువారం సాయంత్రం ఎల్బీనగర్‌కు వచ్చాడు. ఆయన కుమారుడైన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పాలపాటి శ్యాంసుందర్ సరూర్‌నగర్‌లోని బహదూర్‌గూడలో ఉంటున్నారు. కుమారుడి ఇంటికి వెళ్లేందుకు రాధయ్య ఎల్బీనగర్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా, అదే సమయంలో ఉప్పల్ డిపోకు చెందిన టీఎస్ ఆర్టీసీ బస్సు ఆయనను ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలవడంతో రాధయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద లభ్యమైన సెల్‌ఫోన్ ద్వారా ఓ పాదచారుడు శ్యాంసుందర్‌కు సమాచారం అందించాడు. వెంటనే శ్యాంసుందర్ ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సదరు టీఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ చింతకింది నరేష్‌పై కేసు నమోదు చేసి ఎల్బీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

31 లీటర్ల నాటుసారా పట్టివేత

మిర్యాలగూడ, మార్చి 21: నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎల్.మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మిర్యాలగూడ మండల పరిధిలోని అయిలాపురం గ్రామశివారులో రూట్‌వాచ్ నిర్వహించి అక్రమంగా ఆటోలో 31 లీటర్ల సారా రవాణా చేస్తున్న అయిలపురం గ్రామానికి చెందిన ధానావత్ హుస్సేన్ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతదేహం అప్పగింత

మిర్యాలగూడ రూరల్, మార్చి 21: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని గూడూరు సమీపంలో గల అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ఈ నెల 20న లారీ ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. గురువారం ఆమె మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంనగర్‌బందం గ్రామానికి చెందిన దేవులపల్లి లక్ష్మమ్మ(65) ఈనెల 20న గూడూరు గ్రామంలో రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి వచ్చి, తన మనుమరాలు ఇంటికి వెళ్లేందుకు అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా చెన్నై వైపు వెళ్తున్న లారీ లక్ష్మమ్మను వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని ఎవరూ గుర్తించకపోవడంతో గూడూరు పంచాయతీ సెక్రటరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా గురువారం లక్ష్మమ్మ మేనల్లుడు గుర్తించినందున పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.22.65లక్షలు స్వాధీనం


నార్కట్‌పల్లి, మద్దిరాల, డిండి, కోదాడ రూరల్, తిరుమలగిరి, మిర్యాలగూడ అర్బన్, మార్చి 21: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనుమతికి మించి తరలిస్తున్న రూ.22.65లక్షల నగదు, రూ.5లక్షల విలువైన వెండిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని పల్లెపహాడ్‌కు చెందిన రామచంద్రారెడ్డి ఓ కారులో తరలిస్తున్న రూ.10లక్షలను వాహనాల తనిఖీలో భాగంగా నార్కట్‌పల్లిలో స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధి రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద కారులో తరలిస్తున్న రూ.80 వేల నగదును అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని కుంటపల్లి చెక్ పోస్టు వద్ద టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న రూ.1.70లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ మధునాయుడు తెలిపారు. నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీల్లో భాగంగా చందంపేట నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలానికి మోటర్‌బైక్‌పై తరలిస్తున్న రూ.2.44లక్షల నగదును చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి చెక్‌పోస్టు వద్ద రూ.2,51,800లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మిర్యాలగూడ పరిధిలోని నందిపాడు బైపాస్‌లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి నుంచి రూ.3.04లక్షలు, రైల్వేస్టేషన్‌లో ఐదు కిలోల వెండి స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



నగదును స్వాధీనం చేసుకుంటున్న నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డి

ఎద్దు పొడిచి రైతు దుర్మరణం

చింతపల్లి, మార్చి 21: సాగు బాటలో తనతో కలిసే నడిచే ఆ ఎద్దే రైతు పాలిట మృత్యువైంది. మేత వేస్తున్న రైతును నుదుటి భాగంలో పొడవటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం ఉదయం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం చవుళ్లతండాలో ఈ విషాదం నెలకొంది. ఎస్ఐ బి.యాదయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చవుళ్లతండాకు చెందిన ఇస్లావత్ దేన్యా(55) తనకున్న రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పొలం వద్దే గుడిసెను ఏర్పాటు చేసుకుని తన రెండు ఎద్దులను కూడా గుడిసెలోనే ఉంచడంతోపాటు ప్రతిరోజూ అక్కడే నిద్రిస్తుంటాడు. బుధవారం రాత్రి దేన్యా భార్య బిచ్చి భర్తకు ఆహారం ఇచ్చి తిరిగి ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం దేన్యా ఎద్దుకు మేత వేస్తుండగా నుదుటి భాగంపై బలంగా కొమ్ముతో పొడవడంతో దేన్యా అచేతనంగా పడిపోయాడు. అటువైపుగా వెళుతున్న కొందరు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు, తండావాసులు పొలం వద్దకు వచ్చి చూడగా దేన్యా మృతిచెంది ఉండటంతో కన్నీటిపర్యంతమయ్యారు. ఎస్ఐ యాదయ్య సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దేన్యాకు భార్య బిచ్చి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య బిచ్చి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని దేవరకొండ సివిల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దేన్యా(ఫైల్)

షిర్డీకి సాయి భక్తుల పాదయాత్ర


షిర్డీకి పాదయాత్రగా బయలుదేరిన సాయిబాబా భక్తులు

హుజూర్‌నగర్, మార్చి 21: పట్టణం నుంచి షిర్డీకి 20మంది సాయిబాబా భక్తులు పాదయాత్రగా గురువారం బయలుదేరారు. ముందుగా పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షిర్డీకి పాదయాత్రగా వెళుతున్న భక్తుల బృందాన్ని ఆలయ కమిటీ చైర్మన్ త్రిపుర మళ్ల అంజయ్య, ప్రధానకార్యదర్శి ఓరుగంటి నాగేశ్వరరావు, రాష్ట్ర మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గజ్జి ప్రభాకర్‌గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వశాంతిని కోరుతూ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు గురుస్వామి కీలుకాని సత్యనారాయణ తెలిపారు. షిర్డీకి పాదయాత్రగా బయలుదేరిన భక్త బృందంలో అంధురాలు జువ్వాజి యల్లమ్మ ఉన్నారు.

సంప్రదాయబద్ధంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, మార్చి 21: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో గురువారం శ్రీలక్ష్మీ నృసింహుని కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, పాలక మండలి సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవాలయానికి వెండి వస్తువుల బహూకరణ

సూర్యాపేట రూరల్, మార్చి 21: సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి ఎర్రకేశ్వరాలయానికి రూ.3.86లక్షల విలువైన వెండి వస్తువులను డాక్టర్ ఆదర్శ్ పేరిట హైదరాబాద్‌కు చెందిన మరికంటి రాజశేఖర్, వనజ దంపతులు గురువారం దంపతులు అందజేశారు. మారేడు దళాల దండలు కూడా రాజశేఖర్ దంపతులు బహూకరించినట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామిరెడ్డి ఎన్నిక


రామిరెడ్డి అధ్యక్షుడు


వీరయ్య కార్యదర్శి

హుజూర్‌నగర్, మార్చి 21: హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాముల రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని న్యాయవాదుల సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు, కార్యదర్శితో పాటు మొత్తం 11మంది కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా సాముల రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జక్కుల వీరయ్య, ఉపాధ్యక్షుడిగా జక్కుల నాగేశ్వరరావు, కోశాధికారిగా బాణోత్ సురేష్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శిగా విశ్వనాథం, సాంస్కృతిక కార్యదర్శిగా గుగులోత్ వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా యాదగిరి, నాగార్జున, ప్రశాంత్, వెంకటేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు సుందర రాఘవరావు, అంజయ్యలు ప్రకటించారు. కాగా సహాయ కార్యదర్శి పదవికి నలుగురు నామినేషన్లు దాఖలు చేయగా వారందరూ నామినేషన్లు ఉపసంహరించుకున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా నాగేశ్వరరావు


ప్రమాణ స్వీకారం చేస్తున్న మత్స్యసహకార సంఘం సభ్యులు

మఠంపల్లి, మార్చి 21: మఠంపల్లి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా తవడబోయిన నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. మత్స్యకార సంఘానికి బుధవారం ఎన్నికలు నిర్వహించారు. గెలుపొందిన సభ్యులు నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా తుంగం వీరయ్య, కార్యదర్శిగా చింతల వీరబాబును ఎన్నుకున్నట్లు కోఆపరేటివ్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి వి.అశోక్‌కుమార్ ప్రకటించారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

మండల వాసికి ఆణిముత్యం పురస్కారం

మఠంపల్లి, మార్చి 21: మండల కేంద్రానికి చెందిన గుంటి పిచ్చయ్య ఆణిముత్యం పురస్కారాన్ని అందుకున్నారు. మున్నంగి భాస్కర్‌రావు 83వ జయంతి సందర్భంగా శివాని ఆర్ట్స్ అసోసియేషన్ వైఎస్సార్ మూర్తి చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఈ అవార్డును పిచ్చయ్యకు సినీ డైరెక్టర్ రాజశేఖర్ అందజేశారు.

'ఉపాధి' కూలీలకు 200రోజులు పనులు కల్పించాలి

పెన్‌పహాడ్, మార్చి 21: 'ఉపాధి' కూలీలకు 200రోజులు పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెళ్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దూపహాడ్ గ్రామంలో నిర్వహించిన ఉపాధిహామీ కూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఎడమ కాల్వ, ఎస్సారెస్పీ నీరు రానందున పైర్లు ఎండిపోయి పనులులేక కూలీలు పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. దూపహాడ్ గ్రామంలో బీపీఎం లేనందున లింగాల గ్రామానికి కూలీలు వెళ్లి 'ఉపాధి' వేతనాలు తీసుకోవాల్సి వస్తుందని, వెంటనే దూపహాడ్ గ్రామంలో బీపీఎంను నియమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు సిరికొండ సైదులు, గుంజ వెంకటేశ్వర్లు, మంజుల, నీలిమ, ఉపేంద్ర, వెంకన్న, మల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవాలి


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కమ్మజన సేవాసమితి నాయకులు

సూర్యాపేట టౌన్, మార్చి 21: ఆర్థికంగా వెనుకబడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కమ్మజన సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఉన్నం సత్యానారాయణరావు కోరారు. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మసామాజిక వర్గంలో అనేక మంది పేదవారు ఉన్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు అబ్బూరి వినోద్, నిమ్మగడ్డ జనార్దన్‌రావు, పోటు మోహన్‌రావు, మిక్కిలినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

గరిడేపల్లి, మార్చి 21: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన చింతోజు ఉపేంద్రచారి (25)బైక్‌పై గురువారం రాత్రి 11 గంటల సమయంలో గరిడేపల్లి నుంచి సూర్యాపేటకు బంధువుల ఇంటికి వెళుతుండగా పొనుగోడు గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేంద్రాచారి అక్కడికక్కడే మృతి చెందాడు

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

నాగారం, మార్చి 21: ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి పంటలను ఆదుకోవాలని ని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నాగారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పంటలు పూర్తయ్యే వరకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

27లీటర్ల సారా స్వాధీనం

హుజూర్‌నగర్, మార్చి 21: హుజూర్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బుధవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలంలో నలుగురి నుంచి 27లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు చెందిన రెండు బైకులను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో జగన్మోహన్‌రెడ్డి, ధనుంజయ్, గోవర్ధన్, నరేష్, రవి, నాగరాజు పాల్గొన్నట్లు సీఐ తెలిపారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తా

ఎమ్మెల్యే మందుల సామేలు


అర్వపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అర్వపల్లి, మార్చి 21: వేసవి కాలం వచ్చినందున నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తానని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. . గురువారం అర్వపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ మెజార్టీతో గెలుస్తుందని అన్నారు అసెంబ్లీ ఎన్నికల్లో తనను 50వేల మెజార్టీతో గెలిపించారని, పార్లమెంట్ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి లక్ష మెజార్టీ ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టడమే తమ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ ఉనికి లేదన్నారు. . ప్రజలకు ఆరు గ్యారెంటీలు అందాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, వేల్పుల రమేష్ బైరబోయిన మహారాజు, వెంకటస్వామి, శ్రీకాంత్, సంతు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

తుంగతుర్తి: మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త మంగళాపెల్లి ముత్తయ్య ఇటీవల మృతి చెందాడు. ముత్తయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సామేలు పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముత్తయ్య ఎన్నో సంవత్సరాలుగా ముత్తయ్య ఆర్టీసీ బస్టాండ్‌లో నామమాత్రపు జీతంతో పనిచేస్తూ ప్రజలకు సేవ చేశాడని కొనియాడారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఓరుగంటి సత్యనారాయణ, ఉప్పుల రాంబాబు, అజయ్‌కుమార్ ఉన్నారు.

తిరుమలగిరి: తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన, పెరుమాళ్ల అనంతరావు, కానగండ్ల సోమయ్య, కొత్త అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయా కుటుంబాల సభ్యులను ఎమ్మెల్యే సామేల్ పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.నరేష్, కౌన్సిలర్లు అనసూయ, సరిత, పేరాల వీరేష్, పాలకుర్తి రాజయ్య, సుంకరి జనార్దన్, బత్తుల శ్రీను, రాముగౌడ్, అంబేడ్కర్, సుధాకర్, రమేష్ ఉన్నారు.

'ఉపాధి' పనులను పారదర్శకంగా నిర్వహించాలి


తుంగతుర్తిలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

తుంగతుర్తి, మార్చి 21: ఉపాధి హామీ పనులు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఉపాధిహామీ పీడీ మధుసుదన్‌రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ మండల సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 'ఉపాధి' పనులను పారదర్శకంగా నిర్వహించాలని, తేడాలు వస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధిహామీ పథకంలో జరిగే ప్రతి పనిని సోషల్ ఆడిట్ చేస్తామని, బిల్లుల్లో తేడాలు ఉంటే డబ్బును రికవరీ చేస్తామన్నారు. మండలంలో రూ.4.45లక్షలు తేడాలు వచ్చినట్లు తన దృష్టికి వచ్చిందని, బిల్లులను మరోసారి పరిశీలించి తేడాలు ఉంటే ఆ నిధులను సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ అదనపు పీడీ శైలజ, ఎంపీడీవో శేషకుమార్, ఎంపీవో భీంసింగ్, ఏపీవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం

పెన్‌పహాడ్, మార్చి 21: మండలంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని, అధికారులు, ప్రజాప్రతినిధులు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగులపహాడ్ గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేనందున రైతు నారాయణ లింగారెడ్డికి చెందిన పశువులు ఇటీవల మృతి చెందాయని, అదేవిధంగా గతంలో ప్రమాదాలు జరిగాయని, వెంటనే సమస్యను పరిష్కరించాలని పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, నారాయణగూడెం ప్రత్యేక అధికారి చంద్రశేఖరరాజు విద్యుత్ అధికారులను కోరారు. చీదేళ్ల గ్రామ శివారులో వారం రోజుల క్రితం ఎల్‌టీ లైన్ తీగలు తెగిపడినా సిబ్బంది సకాలంలో స్పందించలేదని ఎంపీటీసీ జూలకంటి వెంకటరెడ్డి విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పెన్‌పహాడ్ పీహెచ్‌సీలో రోగులకు సకాలంలో వైద్యం అందడంలేదని, ఎంపీటీసీ సభ్యులు చేసిన ఆరోపణలపై సమావేశంలో వాడివేడిగా చర్చ జరిగింది. స్పందించిన ఎంపీపీ నెమ్మాది భిక్షం సమావేశంలోనే డీఎంహెచ్‌వోకి ఫోన్ చేసి వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి సకాలంలో రోగులకు వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో 15ఎజెండా అంశాలు చర్చించాల్సి ఉండగా కేవలం విద్యుత్, వైద్యం, నీటి సరఫరాలపై మాత్రమే అర గంట చర్చించి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీవో నరేష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.4.80కోట్లకు వ్యాపారి ఐపీ

- ఐదు రోజులుగా మండలంలో చర్చాంశనీయం
- బక్కమంతులగూడెంలో వెలుగు చూసిన రెండో ఘటన
- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

మఠంపల్లి, మార్చి 21: మండలంలోని బక్కమంతులగూడెంలో ఓ వ్యాపారి రూ.4.80 కోట్లకు ఐపీ పెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని బక్కమంతులగూడెంకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చీటీలు, వడ్డీలకు నగదు వసూలు చేశాడు. వ్యాపారి నాలుగు నెలలుగా కనిపించకపోగా తనకు డబ్బులు ఇచ్చిన వారికి ఐపీ నోటీసులు పంపడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వ్యాపారిగా గ్రామంలో అందరికీ పరిచయాలు ఉండటం, అంతకముంకు ఎల్‌ఐసీ ఏజెంటుగా పనిచేయడంతో ఆ నమ్మకంపై బాధితులంతా వ్యాపారికి వడ్డీకి అప్పులు ఇచ్చారు. ఒక్కొక్కరు రూ.3లక్షల నుంచి రూ.10లక్షల వరకు వ్యాపారికి నగదు ఇచ్చినట్లు తెలిసింది. వడ్డీ ఇవ్వకపోగా అసలు డబ్బులు కూడా చెల్లించకపోవడంతో పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం చీటీల పేరిట డబ్బులు చెల్లించిన వారంతా వ్యాపారి పెట్టిన ఐపీతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలిసిన వారని డబ్బులు ఇచ్చి మోసపోయామని, తమకు న్యాయం చేయాలని కనబడిన నేతలను, అధికారుల ఎదుట మొర పెట్టుకుంటున్నారు. మండలంలో సంచలనం కలిగించిన వ్యాపారి ఉదంతం బాధితుల్లో ఆవేదనను చీటీల వ్యాపారం చేస్తున్న ఇతరులను కంగుతినిపించింది.

నాలుగేళ్ల క్రితం రూ.5కోట్లు.. ఇప్పుడు రూ.4.80కోట్లు

ఇటీవల రూ.4కోట్లతో ఐపీ పెట్టిన విషయం బాధితులను విచారంలో ముంచగా, నాలుగేళ్ల క్రితం ఇదే గ్రామానికి ధాన్యం వ్యాపారం చేసే ఒకరూ రూ.5కోట్లు ఉడాయించి ఐపీ పెట్టారు. ఆ సొమ్ము వసూలు కాగా మరో ఘటన చోటు చేసుకోవడంతో గ్రామస్థులను మరింత కుంగతీస్తోంది. 80 మంది బాధితుల్లో గత ధాన్యం వ్యాపారికి ఇచ్చిన వారు కూడా ఉండటం విశేషం. మండలంలోనే మేజర్ గ్రామపంచాయతీ అయిన బక్కమంతులగూడెంలో వ్యవసాయంపై ఆధారపడిన రైతులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, మేథావులు ఉన్నా, ఐదేళ్లలో దాదాపు రూ.10కోట్లు వసూలు చేసి ఉడాయించిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామంలోని కూలీలు, నిరస్వరాసులైన అమాయకులను మోసం చేసినా, బాధితులు పోలీసులను ఆశ్రయించినా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీ పెట్టిన వ్యాపారుల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక వారికి కూడా ఇందులో వాటాలు ఉన్నాయా..? ఎంతమంది వ్యాపారులతో కుమ్మక్కయ్యారు..? అనే అనుమానాలను మండల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిటీ ఫ్రిడ్జ్ కేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయం


కమ్యూనిటీ ఫ్రిడ్జ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 21: పట్టణంలో కమ్యూనిటీ ఫ్రిడ్జ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమని ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట పేదలకు సహాయం చేసేందుకు ఏర్పాటు చేసిన ఫ్రిడ్జ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల్లో మిగిలిన భోజనం, కూరగాయలు, దుస్తులు, వాటర్ బాటిళ్లు, దుప్పట్లు ఈ ఫ్రిడ్జ్ కేంద్రానికి తీసుకువస్తే, పేదలకు పంచుతారని తెలిపారు. కార్యక్రమంలో ముఖీద్, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, బలరామిరెడ్డి, యర్రయ్య, అయూబ్, షారుక్‌ఖాన్, ఇమ్రాన్, సమీర్, జలేందర్, సలీం పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా: హనుమయ్య


హనుమయ్యను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కోదాడ, మార్చి 21: రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అనంగిరి మండలం ఖానాపురం గ్రామ పీఏసీఎస్ చైర్మన్ జొన్నలగడ్డ హనుమయ్య అన్నారు. 50సంవత్సరాలుగా పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేస్తున్న హనుమయ్యను బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో విత్తనాలు అందక, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర పభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనగాల వెంకట్రామయ్య, నూనె సులోచన, కనగాల నారాయణ, వంగవీటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్: మండలంలోని నాగులపహాడ్ గ్రామంలో 'ఉపాధి' నిధులు రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనుల నిర్మాణ పనులను కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఒగ్గు దేవయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సహకారంతో పనులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసాల సోమయ్య, ఇంద్రయ్యపాల్గొన్నారు.

హుజూర్‌నగర్: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డిప్యూటీ పారామెడికల్ అధికారి మాతంగి సురేష్ కోరారు. బుధవారం పట్టణంలో కుష్టు వ్యాధిపై జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చర్మం మొద్దుబారడం, రాగి రంగు ఆకారంలో స్పర్శలేని మచ్చలను గుర్తించి పరీక్షల అనంతరం బహుళ ఔషధ చికిత్స ద్వారా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ అధికారులు ఇందిరాల రామకృష్ణ, ఇందిర పాల్గొన్నారు.

మఠంపల్లి: మండల కేంద్రంలోని శుభవార్త చర్చి ఆవరణలో శుభోదయ యువజన సంఘం, చర్చి ఫాదర్, పెద్దల సహకారంతో ఈనెల 24న ఉచిత మహిళ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభరత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన వైద్యురాలు సంయుక్తారెడ్డి తన తండ్రి డాక్టర్ టీఎస్‌రెడ్డి జ్ఞాపకార్థం మహిళలకు పిల్లల కోసం, ఇతర సాధారణ పరీక్షలను ఉచిత నిర్వహిస్తారని తెలిపారు

కోదాడ రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి సూచించారు. మండలంలోని గుడిబండ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డయల్ 100పై సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసే టోల్‌ఫ్రీ నెం1930పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిరాల: వేసవి కాలం వచ్చినందున గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ప్రభుత్వ బోర్లను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్ ఉన్నారు.

పెన్‌పహాడ్, మద్దిరాల తుంగతుర్తి: ఉచిత పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పెన్‌పహాడ్ మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి కిరణ్‌కుమార్, మద్దిరాల మండల పశువైద్యాధికారి ఆసీఫా అన్నారు. గురువారం పెన్‌పహాడ్ మండలంలోని పొట్లపహాడ్, దూపహాడ్ గ్రామాల్లో, మద్దిరాల మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో బీఎల్‌వో శ్రీనివాస్ రెడ్డి, జేవీవో స్వరూప్, గోపాలమిత్రలు సైదయ్య, మహబూబ్ ఆలీ, శ్రవణ్‌కుమార్, లింగమూర్తి సైదులు, వెంకన్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

● పశు వైద్యశిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రవిప్రసాద్ అన్నారు. తుంగతుర్తిలో ఏర్పాటుచేసిన పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. 197 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు సుష్మ, బుచ్చిబాబు, మహేష్, రైతులు ఫజూరుద్దీన్, రాజు, వీరయ్య, వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మీలా మహదేవ్

సూర్యాపేట టౌన్, మార్చి 21: వివిధ పనుల నిమిత్తం సూర్యాపేటకు వచ్చే ప్రజలు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సుధాకర్ పీవీసీ పరిశ్రమల ఎండీ మీలా మహదేవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సుధాకర్ పీవీసీ పరిశ్రమల ఆధ్వర్యంలో ఎంతో మందికి జీవనోపాధి కల్పించడంతో పాటు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఈఈ జీకేడీ ప్రసాద్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహారంగా సిరిధాన్యాలను తీసుకోవాలి

ఆత్మకూర్(ఎస్), మార్చి 21: పోషకాలు ఎక్కువగా ఉన్న సిరిధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సీడీపీవో శ్రీవాణి అన్నారు. పోషన్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కోటపహాడ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల ప్రాముఖ్యం, పోషక విలువలపై అవగాహన కల్పించారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలనుసూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునంద, పల్లె దవాఖానా డాక్టర్ మహేష్, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, ఉపేంద్ర, శిరీష, ఏఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పశువులకు బార్ కోడ్ చెవిపోగులు తప్పనిసరి

చిలుకూరు, మార్చి 21: గ్రామాల్లో పశువులకు బార్ కోడ్ చెవిపోగులు తప్పనిసరిగా వేయించాలని ఏవీడీ డాక్టర్ పెంటయ్య సూచించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల తనిఖీలో భాగంగా గురువారం మండలంలోని నారాయణపురం గ్రామంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆధార్ నెంబరు కేటాయించిన విధంగా, పశువులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగిన బార్ కోడ్ చెవిపోగులను గతంలో వేశామన్నారు. కొత్తగా పుట్టిన దూడలకు కూడా చెవిపోగులు వేసి, చెవిపోగుల నెంబరును 'భారత్ పశుదాన్' యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పోషకులను సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వీరారెడ్డి, సిబ్బంది పరిమళ, వెంకటేశ్వర్లు, నరేష్, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

వీరన్నకు మాతృవియోగం

ఆత్మకూర్(ఎస్), మార్చి 21: టీపీటీఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పుప్పాల వీరన్న మాతృమూర్తి సత్తమ్మ(80) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. సత్తమ్మ మృతదేహానికి గురువారం ఆమె స్వగ్రామం మండలంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీరన్నను ఆయన ఓదార్చి మాట్లాడారు. ఎందరో విప్లవకారులకు సత్తమ్మ అండగా నిలబడిం దని కొనియాడారు. సత్తమ్మ మృతి ఉద్యమానికి తీరనిలోటని అన్నారు. సత్తమ్మ మృతదేహానికి నివాళులర్పించినవారిలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పాని కృష్ణారెడ్డి, సుభాన్, పూలన్, ముస్కు వెంకటరెడ్డి, రవికుమార్, గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, పోలెబోయిన కిరణ్‌కుమార్, దేశోజు మధు, కంచనపల్లి సైదులు ఉన్నారు.

నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలి


ఎంవీఐ జిలానీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న లారీ అసోసియేషన్ నాయకులు

కోదాడ, మార్చి 21: ప్రభుత్వ నింబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని ఎంవీఐ జిలానీ అన్నారు. గురువారం పట్టణంలో కోదాడ లారీ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో జిలానీని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువులోపు వాహనదారులు పన్నులను చెల్లిస్తే అదనపు భారం ఉండదని, కాలం చెల్లిన వాహనాలను నడపొద్దని సూచించారు. లారీ యజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కనగాల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తూనం కృష్ణ, మాజీ అధ్యక్షుడు రామినేని శ్రీనివాసరావు, గుండపనేని నాగేశ్వరరావు, రఫీ, విలాసక నరసరాజు, పెద్ది అంజయ్య, దొంగరి శ్రీనివాసరావు, లింగయ్య, వీరబాబు, కోటేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

కోదాడ టౌన్, మార్చి 21: ప్రజా సమస్యలపై నాయకులు, కార్యకర్తలు పోరాడాలని అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న అన్నారు. గురువారం కోదాడలోని లాల్‌బంగ్లాలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో ఫాసిస్టు శక్తులను ఓడించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలుచేయాలన్నారు. నీళ్లు లేక పైర్లు ఎండుతున్నాయని, పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగునీటి కొరతను తీర్చేందుకు సాగర్ నీటితో చెరువులను నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉదయగిరి, సైదులు, ఉమేష్, వెంకన్న, నాగేశ్, నర్సిరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

మునగాల రూరల్, మార్చి 21: మండంలోవని కలకోవ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహాల పత్రిష్ఠ ఆహ్వాన పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ జూకూరి అంజయ్య మాట్లాడుతూ ఏప్రిల్ 17, 18, 19, 20, 21 తేదీల్లో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వేదపండితులు వారణాసి ఉదయ్ భాస్కర్‌శర్మ, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి వీరబాబు, గన్నా భవానినరసింహారావు, దొంగరి అప్పారావు, అమరగాని వీరభద్రం, పనస విజయ్, మండవ చిన్న సైదులు, కుడుముల వీరయ్య, బెల్లంకొండ నాగయ్య పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

సూర్యాపేట రూరల్, మార్చి 21: పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు ఆరెస్టు చేశారు. సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మండలంలోని యండ్లపల్లి గ్రామ శివారులో మూసీ కాల్వ పక్కన రాగి చెట్టు కింద పేకాట అడుతున్నట్లు నలుగురి అరెస్టు చేశామన్నారు. నిందితులు నుంచి రూ.18,360లు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాదీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.